సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



రైతన్నకు భరోసా

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఈ ఏడాది (2023-24)కి సంబంధించి ఆఖరి విడత ఆర్థిక సాయం నేడు రైతుల ఖాతాలకు జమ కానుంది. - 8లో



తండ్రి చేతిలో తనయుడి హతం

చెన్నూరు మండలంలోని కొండపేట గ్రామంలో మద్యానికి బానిసైన కన్న కొడుకును తండ్రి మంగళవారం రోకలి బండతో తలపై మోది చంపాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 120 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	365	471
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1890.860 కిలోలు

న్యూస్‌రీల్

పంచాయతీలకు బీఐఎస్ సామగ్రి కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న బీఐఎస్ జేడీ రాకేష్

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించి కొనుగోలు చేసే వస్తువులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్)కు లోబడి ఉండాలని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. జిల్లా పరిషత్‌లోని డీసీఆర్‌సీ భవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బీఐఎస్ ప్రమాణాలపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయకపోతే తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలపై వివరించారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఫ్యాకల్టీ సురేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో గ్రామ పంచాయతీలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ సమావేశంలో వర్క్‌షాప్ పరిశీలకులు రమేష్, ఫ్యాకల్టీ మధుబాబు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వైవీయూ వీసీ, కుల సచివులు, ప్రొఫెసర్లు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో డిసెంబర్ మాసంలో జరిగిన డిగ్రీ మూడు, నాలుగు సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ కుల సచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డితో కలసి విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీవోసీ మూడో సెమిస్టర్‌లో 64.38 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. మొత్తం 5,062 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 3259 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీవోసీ నాలుగు సెమిస్టర్ పరీక్షలను 8803 మంది విద్యార్థులు రాస్తే 4989 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 56.67 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు మమత, గంగయ్య పాల్గొన్నారు.

కార్డుదారులకు రాగిపిండి, జొన్నల పంపిణీ



కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం బియ్యం కార్డుదారులకు మార్చి 1వ తేదీ నుంచి కిలో బియ్యం బదులుగా కిలో రాగిపిండి, రెండు కిలోల జొన్నల పంపిణీకి చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగి పిండి ధర మార్కెట్‌లో కిలో రూ.40లకు విక్రయిస్తుండగా, ప్రభుత్వం కేవలం రూ.11కే అందిస్తుందన్నారు. రాగుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందన్నారు. బియ్యం, రాగిపిండి, జొన్నలతోపాటు అర కిలో చక్కెర, అర్బన్ ఏరియాల్లో రూ.16లతో గోధుమపిండిని కూడా తీసుకోవచ్చని వివరించారు. బియ్యంకార్డు దారులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని ఆయన సూచించారు.

కబ్జా కోరులు.. టీడీపీ నేతలే..!

- రూ.6 కోట్ల విలువ చేసే రెండున్నర ఎకరాలు ఆక్రమణ
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- పట్టాలు చేసుకొనేందుకు 'దేశం' నేతల యత్నాలు
- వైఎస్సార్‌సీపీ నేతల కబ్జాలంటూ 'పచ్చ'రాతలు

ఫ్యాక్ట్ చెక్

దొంగే.. దొంగా.. దొంగా.. అని అరిచినట్టుగా టీడీపీ నేతల పరిస్థితి ఉంది. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండల పరిధి కంద్రగి గ్రామంలోని మురాద్‌బీ కుంటను వారు ఆక్రమించేశారు. పైగా దీన్ని వైఎస్సార్‌సీపీ నేతలు కబ్జా చేశారంటూ ఆరోపించడం 'పచ్చ'నేతలకే చెల్లింది. వారికి అనుకూలమైన ఓ పత్రిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై నిందలు వేస్తూ అసత్య కథనాన్ని ప్రచురించింది. అందుకు సంబంధించిన వాస్తవ వివరాలతో అందిస్తున్న ఫ్యాక్ట్ చెక్ కథనం.



ఆక్రమణలకు గురైన మురాద్‌బీ కుంట

గుర్రంకొండ : మండల పరిధి కంద్రగి గ్రామంలోని మురాద్‌బీ కుంట టీడీపీ నేతల కబ్జా కోరల్లో చిక్కుకొంది. రూ.ఆరు కోట్ల విలువ చేసే రెండున్నర ఎకరాల కుంట స్థలం యథేచ్ఛగా ఆక్రమణకు గురైంది. ఆక్రమించుకున్న విలువైన స్థలాలకు పట్టాలు చేసుకొనేందుకు టీడీపీ నేతలు యత్నాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తూ.. కాలం గడపుతుండటం గమనార్హం. అయితే వైఎస్సార్‌సీపీ నేతలు కబ్జా చేశారంటూ ఓ పచ్చపత్రికలో అసత్య కథనాలు ప్రచురించడం విమర్శలకు తావిస్తోంది.

మూడు రోడ్ల కూడలి దగ్గర ఉండటంతో..

గుర్రంకొండ మార్కెట్‌యార్డు సమీపంలో మూడు రోడ్ల కూడలి ఉంది. ఈ సర్కిల్ వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. దీని పక్కనే కంద్రిగ గ్రామానికి చెందిన మురాద్‌బీ కుంట ఉంది. సర్వే నంబరు 16/1లో 3.37 ఎకరాల్లో కుంట విస్తరించి ఉంది. ఇటీవల కొంత మంది రియల్టర్లు కుంట పక్కనే వెంచర్ వేస్తున్నారు. దీనికి తోడు స్థానికంగా ఉండే కొంత మంది టీడీపీ నాయకులు పక్కనే వ్యవసాయం చేసుకొంటూ మెల్లగా కుంటలోకి చొరబడ్డారు. ఇటీవల మురాద్‌బీ కుంటలో టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు సుమారు రెండున్నర ఎకరాలను ఆక్రమించేశారు. మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుంది. ఆక్రమణలకు గురైన కుంటలో ఓ వర్గం వారు ఇళ్ల స్థలాలు వేసేందుకు ప్రయత్నాలు చేశారు. మరో వర్గం వారు ఏకంగా గతంలో ఇక్కడ పని చేసిన ఓ రెవెన్యూ అధికారి సాయంతో పట్టాలు పొందేందుకు ప్రయత్నించారు. దీనికి తోడు సర్వేనంబరు 503లో మురాద్‌బీ కుంటకు వర్షపునీరు చేర్చే వంక ఉంది. కుంటకు ఎగువవైపు ఉన్న పొలాలు, గుట్టల్లో కురిసే వర్షపునీరు ఈ వంక ద్వారా మురాద్‌బీ వంకకు చేరుతుంది. అయితే ఆక్రమణదారులు వంకను వదలకుండా ఆక్రమించేశారు. ప్రస్తుతం వంక రూపరేఖలు మారిపోయాయి. వంకలోకి వర్షపునీరు చేరే మార్గాలు మూసుకుపోయాయి. మురాద్‌బీ కుంటలో ఆక్రమించుకొన్న స్థలాలకు ఏకంగా సరిహద్దు రాళ్లు నాటేశారు. కుంటను జేసీబీలతో చదును చేసేశారు. ప్రస్తుతం మురాద్‌బీ కుంట ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఈ విషయమై డెప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామిని వివరణ కోరగా.. మురాద్‌బీ కుంట ఆక్రమణలపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కుంట ఎంత విస్తీర్ణంలో ఉందో.. అంత మేరకు జేసీబీతో కందకాలు తవ్వించి సరిహద్దులు నాటిస్తామన్నారు.



కుంట కట్టను జేసీబీతో చదును చేసిన దృశ్యం



కుంట వంక ఆక్రమణకు గురైన దృశ్యం

మంత్రి, ఎమ్మెల్యేలపై నిందలు

టీడీపీలో రెండు వర్గాల వారు యథేచ్ఛగా డీకేటీ భూములు, కుంటలు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తుంటే.. ఓ పత్రికలో మాత్రం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులంటూ నిందలు వేస్తూ కథనాలు ప్రచురించడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల పాత్ర ఏమిలేకపోయినా కావాలనే నిందలు వేస్తూ కథనాలు రాయడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు వాస్తవంగా విచారణ చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తెచ్చి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా 'టెట్' ప్రారంభం



పరీక్షా కేంద్రం బయట అధికారులతో సమీక్షిస్తున్న శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి : ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (ఏపీటెట్ -2024) కంప్యూటర్ బేస్డ్ పరీక్షమంగళవారం జిల్లా వ్యాప్తంగా కేటాయించిన పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ప్రారంభమైంది. నిర్ణీత సమయం కంటే ముందుగానే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. వారిని సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 6 వరకు ఏపీటెట్ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలోని మదనపల్లి, రాయచోటి, రాజంపేటలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1,240 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 948 మంది మాత్రమే హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు, రెవెన్యూ శాఖ సహకారంతో ప్రశాంతంగా నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

పెట్రోల్ బంక్ పనుల పరిశీలన



పెట్రోల్ బంకు పనులను పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజ్ కమల్

పుల్లంపేట : పుల్లంపేట–చిట్వేలికి వెళ్లే రహదారి సమీపంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు పనులను అన్నమయ్య జిల్లా ఏఎస్పీ రాజ్‌కమల్ మంగళవారం పరిశీలించారు. ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు పెట్రోల్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మండల కేంద్రంలో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ కృష్ణచైతన్య, పుల్లంపేట ఎస్సై రఘురాం తదితరులు పాల్గొన్నారు.

అటు అవకాశవాదం.. ఇటు ఆత్మీయ ఆహ్వానం

- కరివేపాకు చందంలా ఉపయోగించుకున్న టీడీపీ
- సముచితస్థానం ఇవ్వాలనుకుంటున్న వైఎస్సార్‌సీపీ
- సమాలోచనలో పడ్డ శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప : 'అవసరం మేరకు వాడుకోవడం, ఆపై కరివేపాకులా వదిలేయడం' టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యగా విశ్లేషకులు వర్ణిస్తారు. అచ్చం అలాంటి పరిస్థితే జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు సతీష్‌కుమార్‌రెడ్డికు ఎదురైంది. పార్టీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో రాజకీయ పోరాటం చేసినా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు రాజకీయాలకు తెర తీశారు. ఫలితంగా సతీష్‌కుమార్‌రెడ్డి సేవలందించిన చోటే ఛీత్కారాలు చవిచూశారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఇటీవల గౌరవప్రదమైన ఆహ్వానం లభించడంతో సమాలోచనలో పడ్డారు. ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా పాలుపంచుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

వేంపల్లె నాగిరెడ్డి పేరు చెబితే తెలియని పాతతరం నేతలుండరు. ఆయన రాజకీయ వారసుడిగా ఆ కుటుంబం నుంచి వచ్చిన ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి స్వశక్తితో అంచెలంచెలుగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీకి పులివెందుల నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా నిలిచి రాజకీయ పోరాటం చేశారు. 1999 నుంచి 2019 వరకూ ఐదు టర్మ్‌లు పులివెందుల టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో తలపడ్డారు. ఓడిపోతామని తెలిసినా పోటీ చేస్తూ టీడీపీ పరువు కోసం తాపత్రయపడ్డారు. అయితే ఆయన టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు ఛీత్కారాలు ఎదుర్కొన్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. దీంతో స్వంత పార్టీలో నేతల కుట్రలు, కుతంత్రాలకు విసిగిపోయి.. క్రియాశీలక రాజకీయాలకు కొంతకాలంగా దూరంగా ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి ఆహ్వానం

సతీష్‌కుమార్‌రెడ్డి సేవలు వినియోగించుకునేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. అలాగే సముచిత స్థానం కూడా ఇచ్చేందుకు యోచిస్తోంది. ఆ మేరకు కడప- కర్నూల్ ఉమ్మడి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్లు కె.సురేష్‌బాబు, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలు సతీష్‌తో చర్చించి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సతీష్‌రెడ్డి ఇంటి ముందు ప్రత్యక్షమయ్యారు. బీటెక్ రవి వైఖరి క్షుణ్ణంగా పరిశీలిస్తే సతీష్‌కుమార్‌రెడ్డి పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత ఏమాత్రం లేదనే పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అధికారంలో ఉండగా ప్రాంతం కోసం, ప్రజల కోసం ప్రతినబూని కృష్ణాజలాలు తీసుకవచ్చేందుకు సతీష్‌రెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేశారు. ఏదేమైనా తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలకం కానున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

డిజిటల్ ఒరబడి

- సర్కారు బడుల్లో మెరుగైన బోధనకు స్విఫ్ట్ చాట్
- ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబ్‌ల్లో అంతర్భాగం
- ప్రతి టీచర్ మొబైల్‌లో ఈ యాప్ ఉండేలా చర్యలు

మదనపల్లె సిటీ : ఏపీ సర్కారు బడుల్లో డిజిటల్ విప్లవం కొనసాగుతోంది. పాఠశాల విద్యలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులో బ్లాక్‌బోర్డు, గ్రీన్ బోర్డులపై పాఠాలు చెప్పే దశ నుంచి.. ప్రతి తరగతి గదిలో డిజిటల్ విధానంలో విద్యాబోధన నిర్వహించే స్థాయిలో కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడుతున్నాయి. గత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేసిన స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)లు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందించిన కంప్యూటర్ ట్యాబ్‌ల వినియోగంపై జిల్లా స్థాయిలో పలు శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయులకు అందించారు. ఈ డిజిటల్ విద్యాబోధన మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు స్విఫ్ట్ చాట్ బాట్ పేరుతో ఓ అనువర్తానాన్ని (యాప్) అనుసంధానం చేస్తూ పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఈ యాప్ విద్యా బోధనలో సహాయకారిగా ఉండేలా రూపొందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి స్మార్ట్‌ఫోన్లలో ఈ స్విఫ్ట్ చాట్‌బాట్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకునేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి లింక్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. లింక్‌తో పాటు ఇన్‌స్టలేషన్ ప్రక్రియ సమాచారాన్ని విద్యాశాఖ ఐటీ సెల్ నుంచి డీఈవో కార్యాలయాలకు అందాయి. ఈ యాప్ ఇన్‌స్టాల్ సమయంలో ఏపీ టీచర్ బోట్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. లాంగ్వేజ్‌ను ఎంపిక చేసుకుని తమ రిజిస్టర్ మొబైల్ నంబర్ ఎంటర్ చేసి, విద్యాశాఖ నుంచి వచ్చిన ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం స్కూల్ యూడైస్ కోడ్, టీచర్ సీఎఫ్‌ఎంఎస్ ఐడీని నమోదు చేయాల్సి ఉంటుంది. టీచర్ తన వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో ఈ స్విఫ్ట్‌చాట్ యాప్‌తో ఎటువంటి ప్రశ్నకైనా సమాధాన్ని రాబట్టుకునేందుకు ఈ నూతన విధానం సులభతరం చేస్తుంది. ఇది అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంపై పని చేసే విధంగా ఈ యాప్‌ను రూపొందించారు. ఈ స్విఫ్ట్‌చాట్ యాప్ పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పీలు, 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించిన ట్యాబ్‌లలో ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఉంది.



స్విఫ్ట్ చాట్ యాప్ ప్రదర్శిస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు

ప్రత్యేకతలు

తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగా ఈ స్విఫ్ట్ చాట్‌లో ఎస్‌ఎంఎస్ చేస్తే క్షణంలో దానికి సమాధానం ప్రత్యక్షమవుతుంది. అలాగే ఈ యాప్‌లో 1 నుంచి 10వ తరగతి వారీగా డిజిటల్ తరగతులు, లైవ్ క్విజ్‌లు, కాంపిటీషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు, రివార్డులు ఈ యాప్‌లో పొందుపరిచారు. నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్‌లో స్టోర్ చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతుల గణితం, మూడు నుంచి పదో తరగతి వరకు గణితం, సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్తులో డిజిటల్ క్లాసులు పొందుపర్చనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగపడే యాప్



తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగా ఈ స్విఫ్ట్ చాట్లో ఎస్‌ఎంఎస్ చేస్తే క్షణంలో దానికి సమాధానం ప్రత్యక్షమవుతుంది. అలాగే నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్‌లో స్టోర్ చేసుకునే అవకాశముంది. ఈ యాప్‌నకు భవిష్యత్తులో మరింత మెరుగులు దిద్దేలా విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

– శ్రీరాం పురుషోత్తం, డీవైఈఓ, మదనపల్లె

గణితంపై క్విజ్‌లు సరదాగా ఉన్నాయి



గణితంపై ఉన్న క్విజ్‌లు, టాస్కులు సరదాగా ఉన్నాయి. జవాబులు, మార్కులు కూడా వెంటనే ప్రత్యక్షమవుతున్నాయి. ఉపాధ్యాయులు ఐఎఫ్‌పీల్లో ఉన్న స్విఫ్ట్ చాట్‌తో గణితం, సైన్స్‌పై ఉన్న డిజిటల్ వీడియోలు చూపిస్తున్నారు. గ్రూపులుగా ఆన్‌లైన్‌లో టాస్కులు పూర్తి చేస్తున్నాము.

– అమీర్‌ఖాన్, 8వ తరగతి విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, మదనపల్లె

సమసమాజ నిర్మాత సీఎం వైఎస్ జగన్

- సేవకులను పాలకులు చేసిన ఘనత ముఖ్యమంత్రిది
- చట్టసభల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట
- పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకే అగ్రస్థానం
- 'సమ సమాజం– నవనిర్మాణం' కార్యక్రమంలో వక్తలు



సమ సమాజం.. నవనిర్మాణం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ వర్గాల ప్రతినిధులు

వైవీయూ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేస్తూ నవసమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ ప్రాతికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ×సమ సమాజం.. నవనిర్మాణం౹ అంశంపై నిర్వహించిన చర్చలో టీటీడీ పాలకమండలి సభ్యుడు సిద్దవటం యానాదయ్య, ఏపీ పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఏపీ హజ్‌కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, సామాజిక వేత్త ఎ. రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సొహైల్, ఆకాశవాణి మాజీ అధికారి జయసింహలతోపాటు పలువురు మహిళలు, సామాజికవేత్తలు, స్వచ్ఛందసేవాసంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జరిగిన సామాజిక విప్లవంపై చర్చించారు. మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీల ఆలోచనలను వారసత్వంగా తీసుకుని సామాజికి న్యాయం చేస్తూ నవనిర్మాణానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

సేవకులను పాలకులు చేసిన ఘనత

స్వాతంత్య్రం సిద్ధించిన 75 ఏళ్ల తర్వాత, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఏర్పాటైన 60 ఏళ్ల తర్వాత చరిత్రలో నిలిచిపోయేలా నాయీ బ్రాహ్మణులకు టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమించడంతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను చట్టసభలకు పెద్దసంఖ్యలో పంపి సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. చిన్నచిన్న కులాలను సైతం దగ్గరకు తీయడంతోపాటు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక న్యాయం జరిగింది. రాష్ట్రంలో 1185 మంది నాయీబ్రాహ్మణులు వివిధ ఆలయాల్లో పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడం కంటే సామాజిక న్యాయం ఏముంటుంది.

– సిద్దవటం యానాదయ్య, టీటీడీ పాలక మండలి సభ్యులు, కడప

50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు

మహిళా బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపి అమలులోకి రానప్పటికీ రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. 41 బీసీలతోపాటు 70 సీట్లను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించి చట్టసభలకు పంపిన ఘనత ముఖ్యమంత్రిదే. కులం, మతం, ప్రాంతం, వర్గం చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న చరిత్ర ఈ ప్రభుత్వంది. 2.58 వేల కోట్ల రూపాయలను డైరెక్ట్‌గా లబ్ధిదారులకు అందజేయడంతో పాటు చేనేత వర్గాలకు ప్రత్యేకంగా యేడాదికి రూ.24 వేలు అందిస్తున్నాం.

– జింకా విజయలక్ష్మి, ఏపీ పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల సమీపంలో ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి మంగళవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మల్లెల గ్రామానికి చెందిన అంజినేయులు (35) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 92 మద్యం ప్యాకెట్లతో పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం



మల్లికార్జున (ఫైల్)

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట అరుంధతి వాడకు చెందిన చెంచుగొల్ల మల్లికార్జున (29) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతని తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు మల్లికార్జున ఈనెల 24వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు కడపలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం గురించి మాట్లాడి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తమకు తెలిసిన గృహాలను, ప్రదేశాలను, ఊర్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మల్లికార్జున తల్లి చెంచుగొల్ల రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు.

పోగొట్టుకున్న బ్రేస్‌లెట్ మహిళకు అప్పగింత

ప్రొద్దుటూరు క్రైం : బస్సులో ఓ మహిళ తన బంగారు బ్రేస్‌లెట్‌ను పోగొట్టుకుంది. అయితే అదే బస్సులో ప్రయాణిస్తున్న ఎస్‌ఐ పుల్లన్న చొరవతో బ్రేస్‌లేట్‌ను వెతికి బాధిత మహిళకు అందజేశారు. వివరాలు ఇలా.. ప్రొద్దుటూరుకు చెందిన ఒక మహిళ మంగళవారం బస్సులో కడపకు బయలుదేరింది. కడపలో పీసీఆర్ ఎస్‌ఐగా పని చేస్తున్న పుల్లన్న అదే బస్సులో కడపకు బయలుదేరారు. ప్రయాణిస్తున్న సమయంలో ఆమె వద్ద ఉన్న బంగారు బ్రేస్‌లెట్ ఎక్కడో పడిపోయింది. అయితే కడప సమీపంలోకి వెళ్లిన తర్వాత బస్సు దిగే సమయంలో చూసుకోగా బ్రేస్‌లెట్ కనిపించలేదు. ఎస్‌ఐ పుల్లన్న చొరవ తీసుకొని బస్సులో వెతకగా బ్రేస్‌లెట్ కనిపించింది. ఎస్‌ఐకి మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని చాబలి రెవెన్యూ పొలం పరిధిలో ఉన్న ఐరన్ ఓర్ మైన్స్‌లో మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో గోపరాజుపల్లె గ్రామానికి చెందిన పంగా పెద్ద గంగన్న(40 మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... పెద్ద గంగన్న చిన్న చిన్న విద్యుత్ మరమ్మతుల పనులు చేసేవాడు. ఐరన్ ఓర్ మైన్స్‌లో విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దీనిపై ఎస్‌ఐ సునీల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ షాక్‌తో మరణించాడా లేక ప్రమాదవశాత్తు కిందపడ్డాడా అనేది విచారణలో తెలుస్తుందన్నారు.

రైతన్నకు భరోసా.!

- నేడు వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ జమ
- మూడో విడతలో రైతు భరోసా కింద 205806 లక్షల మందికి 41.26 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ కింద 57090వేల మందికి రూ.15.278 కోట్లు
- తాడేపల్లి నుంచి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాలకు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్



రాయచోటి : వైఎస్సార్ రైతు భరోసా కింద 2023–24 సీజన్ మూడో విడత పెట్టుబడి సాయంతో పాటు రబీ 2021–22, ఖరీఫ్–2022 సీజన్‌లో అర్హత పొందిన రైతు కుటుంబాలకు సున్నా వడ్డీ రాయితీ సొమ్ముల పంపిణీకి రంగం సిద్ధమైంది. అన్నమయ్య జిల్లాలో రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ కింద 262896 మంది రైతు కుటుంబాలకు రూ.56.538 కోట్ల రూపాయలను జగనన్న ప్రభుత్వం సాయం అందించనుంది. 5వ సంవత్సరం మూడో విడతగా రైతు భరోసా కింద 205806 లక్షల మందికి రూ.41.26కోట్లు అకౌంట్లలోకి జమ చేయనున్నారు. అలాగే రబీ 2021–22, ఖరీఫ్–2022కు సంబంధించి 57090 మందికి సున్నా వడ్డీ రాయితీ సొమ్ముగా రూ.15.278 కోట్లను అందిస్తారు. ఈ సొమ్ములను ఈనెల 28వ తేదీన సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా అకౌంట్లలోకి జమ చేయనున్నారు.

తప్పకుండా సున్నా వడ్డీ రాయితీ..

వడ్డీ భారం తగ్గించడంతో పాటు రైతుల్లో ఆర్థిక క్రమశిక్షణ తీసుకురావడమే లక్ష్యంగా 2019 సీజన్ నుంచి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. సీజన్‌లో రూ.లక్ష లోపు తీసుకున్న రుణాన్ని ఏడాదిలోపు చెల్లించిన వారిలో ఈ క్రాప్ ప్రామాణికంగా అర్హులైన రైతుల పొదుపు ఖాతాలకు సీజన్ చివరిలో సున్నా వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. గత ప్రభుత్వంతో పోలిస్తే రైతుల సంఖ్య రెట్టింపు కాగా, వడ్డీ రాయితీ సొమ్ము మూడు రెట్లు ఎక్కువగా అందించినట్లు అయింది.

ఇచ్చిన మాటకంటే ఎక్కువగా..

ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకంటే మిన్నగా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి రైతులకు అండగా నిలిచారు. ఇప్పటికే రూ.65,500 చొప్పున సాయం అందించగా, మిగిలిన సాయం ఈ నెల 28న జమ చేయనుండడం విశేషం.

2023-24 సంవత్సరానికి సంబంధించి మూడవ విడత వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజక వర్గం	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థిక సాయం (కోట్లలో)
రాయచోటి	40490	8.13
రాజంపేట	23571	4.73
కోడూరు	27694	5.56
మదనపల్లి	22740	4.56
పీలేరు	42562	8.52
తంబళ్లపల్లి	48749	9.76
మొత్తం	205806	41.26

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ వివరాలు..

నియోజకవర్గం	రబీ 2021-22		ఖరీఫ్-2022		మొత్తం	
	రైతు	రాయితీ (కోట్లు)	రైతు	రాయితీ (కోట్లు)	రైతు	రాయితీ (కోట్లు)
కోడూరు	1626	0.420	981	0.193	2307	0.613
తంబళ్లపల్లె	1576	0.422	5631	1.557	7207	1.979
పీలేరు	3332	0.926	2831	0.874	6163	1.800
మదనపల్లి	1467	0.395	1295	0.374	2762	0.769
రాజంపేట	612	0.132	1408	0.356	2020	0.488
రాయచోటి	905	0.161	7186	1.829	8091	1.990
మొత్తం	9518	2.456	19032	5.183	28550	7.639

ఆలయ పూజారి అదృశ్యం

ఖాజీపేట : ఖాజీపేటలోని సాయిబాబా ఆలయ పూజారి నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఆయన అదృశ్యంతో ఆలయంలోని విలువైన వెండి ఆభరణాలు మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. ఖాజీపేట టౌన్‌లో ఉన్న సాయిబాబా ఆలయం పూజారి వెంకట ప్రసాద్ శర్మ (31) ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదు. భార్య హేమలత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 23వ తేదీ ఉదయం 9 గంటలకు కడపలో తెలిసిన వారి గృహ ప్రవేశానికి వెళుతున్నట్లు తన భర్త చెప్పాడన్నారు. అప్పటి నుంచి ఇంత వరకూ ఇంటికి తిరిగి రాలేదని ఆమె ఖాజీపేట సీఐ రామాంజులుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు 26వతేదీ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆలయంలో వెండి ఆభరణాలు మాయం

పూజారి కనిపించకపోగా అదే సమయంలో ఆలయంలో విలువైన వెండి ఆభరణాలు మాయమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో ఉన్న ఉత్సవ విగ్రహం సుమారు 5 కేజీలు ఉంటుందని, అలాగే వాటితో పాటు మరికొన్ని వెండి ఆభరణాలు ఉన్నాయని వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

పోలీసుల విచారణ : పూజారి అదృశ్యం కావడంతోపాటు వెండి ఆభరణాల మాయమైన సంఘటనపై ఖాజీపేట పోలీసులు విచారణ మొదలు పెట్టారు. వెండి ఆభరణాలు పూజారి అపహరించాడా లేక మరేవైనా కారణాలు ఇందులో ఉన్నాయా అన్నది తేలాలంటే పూజారి ఆచూకీ తెలియాల్సిందేనని పోలీసులు అంటున్నారు.

విద్యార్థుల జీవితాలతో టీడీపీ నేతల చెలగాటం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులను టీడీపీ నాయకులు తమ రాజకీయ ప్రచారాలకు వాడుకుంటూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ తోట శివసాయి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర ఆరోపించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన సాయి డిగ్రీ కాలేజీ, వశిష్ఠ కాలేజీ యాజమాన్యాలు టీడీపీతో కుమ్మక్కై విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నాయన్నారు. విద్యార్థుల ఉన్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుంటే, అలాంటి విద్యార్థుల చేతనే స్థానిక టీడీపీ నాయకులు బత్యాల చెంగల్ రాయుడు, విశ్వనాథ నాయుడుకు మద్దతుగా వాట్సాప్ గ్రూపులలో ప్రచారం చేయిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిని, అధికార పార్టీని విమర్శిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మహేష్, నందా బాల, కృష్ణారెడ్డి, రాజగోపాల్, రాజారెడ్డి, రామచంద్రయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆలస్యంగా మధ్యాహ్న భోజనం

- వంట గదికి తాళాలు వేసుకుని వెళ్లిన నిర్వాహకులు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై తహసీల్దార్ ఆగ్రహం



వంట ఏజెన్సీ నిర్వాహకులతో చర్చిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ

పెద్దతిప్పసముద్రం : స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లోని పిల్లలకు మంగళవారం 20 నిమిషాల పాటు ఆలస్యంగా మధ్యాహ్న భోజనం వండి పెట్టారు. వివరాల్లోకి వెళితే హైస్కూల్‌లో 450 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు ఐదు మంది ఏజెన్సీ నిర్వాహకులు ఉన్నారు. ఎప్పటి లాగానే మంగళవారం హెచ్‌ఎం అపర్ణాదేవి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను పిల్లలకు వండి పెట్టాలని సూచించడంతో ఏజెన్సీ నిర్వాహకులు తమకు జీతాలు కూడా సక్రమంగా రాలేదని అసహనం వ్యక్తం చేస్తూ భోజనం వండకుండా వంట గదికి తాళాలు వేసుకుని వెళ్లారు. ఎంఈఓ ఆఫీసుకు వెళ్లి 20 నిమిషాల అనంతరం వచ్చి వంట చేసేందుకు ఉపక్రమించారు. అనంతరం ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌ల సమక్షంలో కొంచెం ఆలస్యంగా పిల్లలకు భోజనం వడ్డించారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి, ఆర్‌ఐ అనీషా హుటాహుటిన హైస్కూల్‌కు చేరుకుని హెచ్‌ఎం, ఎంఈఓలు, వంట ఏజెన్సీ నిర్వాహకులతో సమీక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల ఆరోగ్యం కోసం రూ.కోట్ల నిధులు ఖర్చు పెడుతుంటే మీరెందుకు ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తున్నారు, మెనూ ప్రకారం వండి పెట్టమని చెప్పడమూ తప్పేనా, అసలు వంట గదికి తాళాలు వేసే అధికారం మీకెవరిచ్చారు, మీకు ఇష్టం లేకుంటే మానేయండి అంతేగాని పిల్లల జీవితాలతో ఆటలొద్దు అని వంట ఏజెన్సీలపై తహసీల్దార్ మండి పడ్డారు. హెచ్‌ఎం తమకు సహకరించకపోవడంతో తమకు రావాల్సిన జీతాల గురించి మాట్లాడేందుకు ఎంఈఓ ఆఫీసుకు వెళ్లామే గాని తమకు ఎలాంటి దురుద్దేశాలు లేవని ఇక నుంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని భోజన నిర్వాహకులు చెప్పారు. ఈమేరకు లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది.

తండ్రి చేతిలో తనయుడి హతం

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన కన్న కొడుకును తండ్రి మంగళవారం మధ్యాహ్నం రోకలి బండతో తలపై మోది చంపాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండపేట గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి (39)కి పదేళ్ల క్రితం వివాహమైంది. చెడు అలవాట్లకు బానిసగా మారిన ఓబుళరెడ్డిని భార్య ఏడాదికే వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి అతను తండ్రి ఉండేల చిన్న రామిరెడ్డి, తల్లి ఆదిలక్ష్మితో కలిసి ఉండేవాడు. అయితే మద్యానికి బానిస అయిన అతను తల్లిదండ్రులను మద్యానికి డబ్బులు ఇవ్వాలని రోజూ వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం తండ్రిని మద్యానికి డబ్బులు అడగగా అతను లేవని చెప్పడంతో అతనితో గొడవకు దిగాడు. తండ్రిని గొంతుపై కాలితో తొక్కడంతో అక్కడే ఉన్న అతని తోబుట్టువులు అతనిని మందలించి పంపించారు. కాగా మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తల్లి బ్యాంకు పనిమీద చెన్నూరుకు వెళ్లగా ఎవరూ లేని సమయంలో మద్యానికి డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో తండ్రి ఇంట్లో ఉన్న రోకలి బండ తీసుకొని తన కొడుకు ఓబుళరెడ్డి తలపై బాదడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

టైర్ల వ్యాపారిపై దాడి ఘటనలో..

సీఎం సురేష్‌నాయుడు, మల్లేల లింగారెడ్డి సహా 12 మందిపై కేసు



జిల్లా ఆస్పత్రిలో అమీర్ హంజాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వేంగళరెడ్డి పేటకు చెందిన టైర్ల వ్యాపారి కోగటం అమీర్ హంజాపై దాడి చేసిన ఘటనలో టూ టౌన్ పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి అమీర్ హంజాను పాత బస్టాండు సమీపంలోని అన్న క్యాంటీన్‌లోకి పిలిపించి టీడీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. అమీర్ హంజా కుటుంబ సభ్యులు ఇటీవల కాలంలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీన్ని మనసులో పెట్టుకున్న టీడీపీ నాయకులు అతన్ని అన్న క్యాంటీన్ వద్దకు పిలిపించి దాడికి పాల్పడ్డారు. అమీర్ హంజాను బెదిరింపులకు గురి చేసి ఇంట్లో ఉన్న విలువైన డాక్యుమెంట్లు, కారును తెప్పించుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు వీఎస్ ముక్తియార్, సీఎం సురేష్‌నాయుడు, మల్లేల లింగారెడ్డి, ఖలీల్, ఎర్రబల్లి దాదాపీర్, రెహమాన్, డాక్టర్ గౌస్, పవన్, ఆజాద్, లెజెండ్ (మార్కెట్), హరూన్, మన్సూర్‌లపై 147, 148, 324, 352, 386 రెడ్‌విత్ 149 ఐపీసీ సెక్షన్ల కింద టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

టైర్ల వ్యాపారిని పరామర్శించిన ఎమ్మెల్యే రాచమల్లు

టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన అమీర్ హంజాను సోమవారం రాత్రి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి జిల్లా ఆస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న అమీర్ హంజాను పరామర్శించారు. దాడి ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్య పడొద్దని, మీ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా, పార్టీ నాయకులు అమీర్ హంజాను పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె గ్రామంలో లావణ్య (20) అనే వివాహిత సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు మృతురాలు లావణ్యది శ్రీకాకుళం జిల్లా, దివానిపాలెం. కాగా గత నెలలో చింతకొమ్మదిన్నెకు చెందిన గణేష్ రెడ్డితో వివాహమైంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉరివేసుకొని మృతి చెందింది. ఈ విషయం తమ దృష్టికి రావడంతో మృతురాలి తండ్రి హరికృష్ణకు సమాచారం ఇచ్చి విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్లు



పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఈఓ అనురాధ, ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ సాయంతో ఆర్‌టీఐ చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా పొందవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం కడప డీఈఓ కార్యాలయం వద్ద ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా, సెక్టోరియల్ ఆఫీసర్ చల్లా విశ్వనాథరెడ్డిలతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకంలో ఉచితంగా సీట్లు పొందిన వారు నేరుగా 1వ తరగతిలో అడ్మిషన్ పొందవచ్చన్నారు. వీరికి ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందన్నారు. రిజిస్టర్ అయిన ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, సీడబ్ల్యూఎస్ఎన్ వర్గాలకు ఈ సీట్లను కేటాయిస్తారని చెప్పారు. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ కోసం మార్చి 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమానాల నివృత్తికి 18004258599 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'జానమద్ది'



జానమద్ది చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాయలసీమ టూరిజం సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రముఖ కవి, రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మునిరావువీధిలోని కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ కార్యాలయంలో జానమద్ది 10వ వర్ధంతిని జరిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి, హనుమచ్ఛాస్త్రి లాంటి గొప్ప వ్యక్తులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్మారక సంస్థ అధ్యక్షుడు కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ బ్రౌన్ లైబ్రరీకి ఆయన చేసిన సేవ మరువరానిదన్నారు. శాస్త్రి కుమారుడు జానమద్ది నాగరాజు మాట్లాడుతూ తమ తండ్రి చివరి వరకూ పుస్తకాలు రాస్తూనే ఉండేవారని కొనియాడారు. తొలుత జానమద్ది చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిల్లూరి రెడ్డెయ్య రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు, డేవిడ్, సతీష్, జ్యోతి జార్జి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

గన్‌మెన్ తొలగింపు

ప్రొద్దుటూరు : సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి మంగళవారం నుంచి గన్‌మెన్‌ను తొలగించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు ఉన్నతాధికారులు ఈయనకు వన్ ప్లస్ వన్ పద్ధతిలో గన్‌మెన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు గన్‌మెన్‌ను తొలగించారు.

అంధుల పాఠశాలలో సైన్స్ ఫెయిర్

కడప ఎడ్యుకేషన్ : శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం, సైన్సు టీచర్ వేపరాల ఎబినేజర్ సహకారంతో మొట్టమొదటి సారిగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో అంధ విద్యార్థులు తమదైన శైలిలో ప్రాజెక్టులను సిద్ధం చేశారు. స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ దండు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు 8వ తరగతి విద్యార్థి దండు శర్వానందరెడ్డి గాలి కిటికీలు సంజీవనీలు అన్న ప్రయోగం సందర్శకులను ఆలోచింపజేసింది. అలాగే 8వ తరగతి విద్యార్థి కరుణాకర్ సింపుల్ సర్క్యూట్ సహాయంతో నీరు, కరెంట్ వృథా కాకుండా ఆ రెండు వనరులను ఆదా చేయడంపై ప్రయోగాన్ని చేసి అందరిని ఆకట్టుకున్నారు. అలాగే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనే విద్యార్థి ఓడలు నదుల్లో మునుగుతాయని సముద్రాల్లో తేలుతాయనే విషయాన్ని గ్లాసు, గుడ్డును ఉపయోగించి కళ్లకు కట్టినట్టు చూపించాడు. విద్యార్థుల ప్రదర్శనలను పలువురు అభినందించారు.